

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం    తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA    RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 18.07.2026 | సంపుటి: 3 | సంచిక: 166 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 18.07.2026 | V0LUME : 3 | ISSUE : 166 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

- గత భూ లావాదేవీలన్నింటిపై ప్రత్యేక దర్యాప్తు
- బాధ్యుల గుర్తింపు, బాధితులకు న్యాయం లక్ష్యమన్న ప్రభుత్వం
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పులకు కేబినెట్ ఆమోదం
- పంచాయతీరాజ్ చట్ట సవరణలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గ్రీన్ సిగ్నల్

2

## హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం

- భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి
- తొలి రైలును జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

4







## ప్రభుత్వోద్యోగులకు మహా భరోసా

- అట్టహాసంగా న్యూ హెల్త్ స్కీమ్ ప్రారంభం
- 8 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపయుక్తం
- సీజీహెచ్‌ఎస్ ప్యాకేజీల కింద 1,816 రకాల చికిత్సలు
- పథకాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

3



## ఈ నెల 31తో రేషన్ ఈ-కేవైసీ గడువు ముగింపు

- రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడికి ఈ-కేవైసీ తప్పనిసరి
- గడువులోగా పూర్తి చేయకపోతే రేషన్ నిలిచిపోయే అవకాశం
- వృద్ధులు, వేలిముద్రలు పడనివారికి ఐరిస్ సౌకర్యం
- రేషన్ డీలర్లు, మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా నమోదు

**హైదరాబాద్, జూలై 17 :**

రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ ఈ నెల 31లోగా తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ సూచించింది. రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడి బయోమెట్రిక్ లేదా ఐరిస్ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారికి భవిష్యత్తులో రేషన్ పంపిణీ

మిగతా 2వ పేజీలో..

# టీకాంగ్రెస్‌లో సమన్వయలోపం

- పెరుగుతున్న గ్రూపు రాజకీయాలు
- యాదాద్రి బోర్డు నియామకాలపై సీనియర్ నేతల అసంతృప్తి
- గాంధీభవన్‌కు చేరిన తుంగతుర్తి పంచాయతీ
- రాష్ట్ర నాయకత్వ తీరుపై అంతర్గత విమర్శలు
- పీసీసీ చీఫ్ మార్పుపై జోరుగా ప్రచారం

**తెలంగాణ బ్యూరో, జూలై 17**

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రభుత్వం పాలన, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరించినప్పటికీ, పార్టీ వ్యవహారాల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ నేతలు, వివిధ వర్గాల మధ్య సమన్వయం లోపించడం వల్లే వరుస వివాదాలు తెరపైకి వస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**వరుస పరిణామాలతో పెరిగిన అసంతృప్తి**

ఇటీవల యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామకాలు

మిగతా 2వ పేజీలో..



## విద్య, వైద్యంపై ఖర్చు రాష్ట్ర ప్రగతికి పెట్టుబడి

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- 24వేలకు పైగా పడకల సామర్థ్యంతో అగ్రగామిగా వైద్య రంగం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3



## ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం

- 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం

3



## త్వరలో మరో 50 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

- ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి సీతక్క
- నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్
- పదేళ్ల పాలనలో ఉద్యోగాల భర్తీలో విఫలమైందని విమర్శ
- అసత్య ప్రచారాలను నమ్మొద్దని నిరుద్యోగులకు సూచన

**హైదరాబాద్, జూలై 17 :**

తెలంగాణలో ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యలపై రాజకీయ సెగలు రాజుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల నిరంకుశ పాలనలో

మిగతా 2వ పేజీలో..

## నామినేటెడ్ పదవుల భర్తీలో ఆలస్యం

- కార్పొరేషన్ల చైర్మన్ల పునర్నియామకంపై ఉత్కంఠ
- వాయిదాపై పీసీసీ తీరుపై కొందరు నేతల విమర్శలు
- పనిచేసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ ఆలోచన
- సీఎం, పీసీసీ చీఫ్ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం

2








## రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు

2

- ఎరువుల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో దోహదం
- ఈ గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం : మంత్రి తుమ్మల

### డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ
## కుమారుడి విచారణ

- డ్రగ్స్ సరఫరాదారుల కాంటాక్ట్ లిస్టులో పేరు ఉండటంతో విచారణ
- వైద్య పరీక్షల అనంతరం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం
- ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి

2





### ఓటర్ల జాబితా సవరణలో 60 శాతం
## డిజిటలైజేషన్ పూర్తి

- గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పురోగతి
- పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర డిజిటలైజేషన్
- ప్రత్యేక సవరణ శిబిరాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
- గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

2

# డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కుమారుడి విచారణ

**హైదరాబాద్, జూలై 17**

డ్రగ్స్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ ఐఏఎస్ అధికారి కె. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డిని మంగళహాట్ పోలీసులు విచారణకు పిలిచారు. డ్రగ్స్ సరఫరాదారుల కాంటాక్ట్ లిస్టులో అతడి పేరు ఉన్నట్లు గుర్తించడంతో విచారణ చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**పోలీసుల చర్యలు**

విచారణ సందర్భంగా భరత్ రాజ్ రెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల అనంతరం మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన చట్టంలోని నిబంధనల ప్రకారం అతడికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అలాగే స్వచ్ఛందంగా మాదకద్రవ్యాల విముక్తి కేంద్రంలో చికిత్స పొందేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది.

**ఆరోపణలు నిరాధారమన్న వెంకట్రామ్ రెడ్డి**

ఈ వ్యవహారంపై ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పందిస్తూ, తన కుమారుడిని అరెస్టు చేశారన్న వార్తలను పూర్తిగా ఖండించారు. డ్రగ్స్ వినియోగించాడన్న ప్రచారం కూడా వాస్తవం కాదని పేర్కొన్నారు. పోలీసులు కేవలం ప్రాథమిక విచారణలో భాగంగా మాత్రమే వివరాలు సేకరించారని, ఎలాంటి నిర్ధారణకు వచ్చే ఆధారాలు లభించలేదని ఆయన వెల్లడించారు.

**దర్యాప్తు ముమ్మరం**

రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఈ కేసును కూడా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌తో ఉన్న సంబంధాలు, ఇతర అనుమానితుల పాత్రపై విచారణ కొనసాగుతోంది. పూర్తి దర్యాప్తు అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి

# టీకాంగ్రెస్‌లో సమన్వయలోపం

**మొదటిపేజీ తరువాయి**

పార్టీలో అసంతృప్తికి దారితీశాయి. తమకు తగిన ప్రాధాన్యం కల్పించకుండా నియామకాలు జరిగాయని పలువురు సీనియర్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలు కూడా కొత్త వివాదానికి కారణమయ్యాయి. మరోవైపు తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన నాయకుల మధ్య విభేదాలు గాంధీభవన్‌కు చేరడం, అక్కడే ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం పార్టీ అంతర్గత పరిస్థితులను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. కొందరు సీనియర్ నేతల వైఖరి, జిల్లాల స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల మధ్య సమన్వయం లోపించడం కూడా క్యాడర్‌లో అయోమయానికి కారణమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**నాయకత్వంపై పెరుగుతున్న చర్చ**

పార్టీలో తలెత్తుతున్న సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమవుతోందన్న విమర్శలు సొంత పార్టీలోనే వినిపిస్తున్నట్లు సమాచారం. ప్రతి చిన్న అంశం అధిష్ఠానం దృష్టికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర స్థాయిలోనే వివాదాలను పరిష్కరించే వ్యవస్థ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పలువురు నేతలు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో పీసీసీ చీఫ్ మార్పుపై కూడా జోరుగా ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పార్టీ వ్యవహారాల్లో పూర్తి సహకారం అందిస్తూ, అన్ని వర్గాలను సమన్వయం చేయగల నాయకుడికి బాధ్యతలు అప్పగించే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశంపై పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

**హైదరాబాద్, జూలై 17 :**

గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ధరణి పోర్టల్‌లో జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ప్రత్యేక దర్యాప్తు బృందంతో పరిశీలించి, అవకతవకలకు బాధ్యులైన వారిని గుర్తించాలని కేబినెట్ ఆదేశించింది. భూ రికార్డుల్లో జరిగిన అక్రమాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేసింది.

**భూ లావాదేవీలపై ప్రత్యేక విచారణ**

ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ప్రతి భూ లావాదేవీని ఫోరెన్సిక్ స్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ రికార్డుల్లో మార్పులు, అక్రమ బదిలీలు, ఇతర అవకతవకలపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ప్రత్యేక బృందానికి బాధ్యతలు అప్పగించనుంది. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేసే చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**ఇతర కీలక నిర్ణయాలు**

కేబినెట్ సమావేశంలో హైదరాబాద్ ముంబై, హైదరాబాద్ బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్ల అలైన్‌మెంట్‌లో మార్పులకు కూడా ఆమోదం లభించింది. భూ సేకరణ వ్యయాన్ని తగ్గిస్తూ ప్రజలకు అనుకూలంగా స్టేషన్లను అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పెండింగ్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని నిర్ణయించారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చారు. అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపి, సంబంధిత బిల్లును రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

# త్వరలో మరో 50 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను నిలువునా ముంచిందని, యువత జీవితాలతో ఆడుకుందని ఆమె ఆరోపించారు. ఒకప్పుడు నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన రాష్ట్రంలో, గత ప్రభుత్వం కేవలం స్వలాభం కోసమే పనిచేసిందని విమర్శించారు. పదేళ్ల సుదీర్ఘ కాలంలో బీఆర్ఎస్ కనీసం లక్ష ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయిందని, నోటిఫికేషన్ల పేరిట కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఉపాధి అవకాశాలను కూడా తెలంగాణ సిద్ధించిన తర్వాత యువతకు దక్కకుండా చేశారని దుయ్యబట్టారు. అయితే.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుద్యోగుల సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే పారదర్శకంగా, ఎక్కడా కోర్టు వివాదాలు లేకుండా ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపామని ఆమె వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, దీనిలో భాగంగానే త్వరలోనే మరో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన సరికొత్త నోటిఫికేషన్‌లను విడుదల చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని ప్రకటించారు. నిరుద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాల విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నిరుద్యోగ యువత నమ్మవద్దని, ప్రభుత్వంపై నమ్మకంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు

# నామినేటెడ్ పదవుల భర్తీలో ఆలస్యం

**హైదరాబాద్, జూలై 17**

తెలంగాణ కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల భర్తీ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. చాలా కాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులు ఈసారి అవకాశం దక్కుతుందనే ఆశతో ఉండగా, భర్తీ ప్రక్రియలో కొనసాగుతున్న జాప్యంపై పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఇటీవల 37 కార్పొరేషన్ల చైర్మన్ల పదవీకాలం ముగియడంతో వారిని తిరిగి కొనసాగిస్తారా, కొత్త వారికి అవకాశం కల్పిస్తారా అనే అంశం కూడా ఆసక్తికరంగా మారింది.

**ఆలస్యానికి కారణాలపై భిన్నాభిప్రాయాలు**

నామినేటెడ్ పదవుల భర్తీ పదేపదే వాయిదా పడుతుండటంపై కాంగ్రెస్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ తరఫున సమర్థవంతమైన సమన్వయం జరగకపోవడం వల్లే ప్రక్రియ ఆలస్యమైందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నుంచి ఆశించిన స్థాయిలో ఫాలోఅప్ లేకపోవడం కూడా ఇందుకు కారణమనే ప్రచారం గాంధీభవన్ వర్గాల్లో వినిపిస్తోంది. కార్పొరేషన్ చైర్మన్ల పునర్నియామకాల విషయంలోనూ స్పష్టత లేకపోవడం నాయకుల్లో అసంతృప్తిని పెంచుతోందని చెబుతున్నారు.

**పనితీరే ప్రామాణికం**

ఈ విమర్శలను పీసీసీ వర్గాలు తిరస్కరిస్తున్నాయి. అందరికీ పునర్నియామకం సాధ్యం కాదని, పార్టీ కోసం చురుకుగా పనిచేసిన వారికే మరోసారి అవకాశం కల్పించే విధానాన్ని అనుసరించనున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఇదే విషయాన్ని ముందుగానే చెప్పడంతో కొందరు అసంతృప్తితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పనితీరును ఆధారంగా చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

**ముందుగా కొత్తవారికి అవకాశం**

కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంలో సామాజిక సమతుల్యత, రాజకీయ ప్రాధాన్యత, పార్టీ సేవలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుగా కొత్త నాయకులకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం పునర్నియామకాల అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**త్వరలోనే నిర్ణయంపై స్పష్టత**

ఈ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ భేటీ అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలు, పునర్నియామకాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా నామినేటెడ్ పదవులు పూర్తిగా భర్తీ కాకపోవడంతో, ఇకపై ఆలస్యం చేయకుండా పెండింగ్‌లో ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

**సంగారెడ్డి, జూలై 17**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సవరణ శిబిరాల పరిశీలన**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు చేపడుతున్న పనితీరును పరిశీలించి, నమోదు ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.

**రాజకీయ పార్టీలతో సమన్వయం**

శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడారు. పార్టీ ప్రతినిధులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అనే అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓల సమన్వయంతో సవరణ ప్రక్రియ కొనసాగడం సానుకూల పరిణామమని ఆయన పేర్కొన్నారు.

**వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు**

ప్రత్యేక సవరణకు ప్రభుత్వం పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకుని ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎక్కడైనా కొరతగా ఉంటే, వెంటనే సంబంధిత సూపర్‌వైజర్ల నుంచి సేకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# ఈ నెల 31తో రేషన్ ఈకేవైసీ గడువు ముగింపు

**మొదటిపేజీ తరువాయి**

నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

**ప్రతి సభ్యుడికి తప్పనిసరి**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు ఆధార్ కార్డుతో కలిసి స్థానిక రేషన్ దుకాణం లేదా మీ సేవ కేంద్రానికి వెళ్లి ఉచితంగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, వేలిముద్రలు పడని లబ్ధిదారుల కోసం ఐరిస్ గుర్తింపు సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

**పారదర్శకత కోసమే చర్యలు**

అర్హులైన పేదలకు మాత్రమే సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ఈకేవైసీని తప్పనిసరి చేసినట్లు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. నకిలీ, చెల్లుబాటు కాని రేషన్ కార్డులను తొలగించడం, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి రికార్డులను నవీకరించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపింది. గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. గడువులోగా నమోదు చేయని సభ్యుల పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించే అవకాశం ఉండటంతో పాటు, రేషన్ బియ్యంతో పాటు రేషన్ కార్డుతో అనుసంధానమైన ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు.

# మైనర్‌తో అసభ్య ప్రవర్తన

- సీసీటీవీలో చూసి దాడి చేసిన స్థానికులు, కుటుంబసభ్యులు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిందితుడి మృతి
- దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు



**హైదరాబాద్, జూలై 17**

హైదరాబాద్‌లోని కుల్సుంపురలో మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో ఓ వ్యక్తిపై స్థానికులు, బాలిక కుటుంబసభ్యులు దాడి చేసిన ఘటన విషాదాంతమైంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**సీసీటీవీలో ఘటన వెలుగులోకి**

పోలీసుల వివరాల ప్రకారం, కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్రూం సముదాయంలో నివసించే అబ్దుల్ అజీజ్ నిలోఫర్ ఆసుపత్రి సమీపంలో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికతో అతడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన అక్కడి సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

**దాడిలో తీవ్రంగా గాయాలు**

సీసీటీవీ దృశ్యాలను చూసిన బాలిక కుటుంబసభ్యులు, స్థానికులు ఆగ్రహంతో అబ్దుల్ అజీజ్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**పోలీసుల దర్యాప్తు**

ఈ ఘటనపై కుల్సుంపుర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బాలికపై జరిగిన ఆరోపణలతో పాటు దాడి ఘటనపైనా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ల్యాబ్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు

**హైదరాబాద్, జూలై 16:**



రాష్ట్ర వ్యవసాయ శాఖ మరో ప్రతిష్ఠాత్మక విజయాన్ని సాధించింది. రాజేంద్రనగర్‌లోని ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు ప్రయోగశాల (ఎఫ్‌సీవో)కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించింది. ఈ ప్రయోగశాల ఐఎస్‌వో/ఐఈసీ 17025:2017 ప్రమాణాలను విజయవంతంగా అమలు చేసి ఎరువుల రసాయన విశ్లేషణలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించింది. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న తొమ్మిది నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు (ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు)లో రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలే తొలిసారిగా ఈ గుర్తింపు పొందినదిగా నిలిచింది. ఈ ప్రయోగశాలలో ప్రస్తుతం మ్యూరియేట్ ఆఫ్ పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ పౌడర్, (గ్రాన్యులర్) ఎరువుల నాణ్యత పరీక్షలకు గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖకు గర్వకారణం. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది. అలాగే ఎరువుల నాణ్యతపై రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, రాష్ట్రంలో నాణ్యత నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంలో ఈ గుర్తింపు కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రయోగశాలకు లభించిన గుర్తింపు రాష్ట్రంలోని ఇతర వ్యవసాయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలకు కూడా దశలవారీగా కల్పించే ప్రక్రియకు నాంది పలికింది. ఈ సందర్భంగా గుర్తింపు పత్రం గురించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకువివరించారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఎఫ్‌సీఓ ప్రయోగశాలకు గుర్తింపు లభించడం రాష్ట్ర వ్యవసాయ శాఖకు గర్వకారణమని అన్నారు.

**మంత్రులతో ఇరాన్ ప్రతినిధి బృందం భేటీ**

ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సచివాలయంలో సమావేశమయ్యారు. ఇరాన్ సహకార, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి హెచ‌ఈ డాక్టర్ మెయిదరి, డాక్టర్ సార్ఫి, సహకార శాఖ ఉప మంత్రి, భారత్‌లోని ఇరాన్ రాయబారి హెచ్‌ఈ డాక్టర్ మహమ్మద్ ఫాత్ అలీ, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ హెచ్‌ఈ హమీద్ అహ్మదియే, వైస్ కాన్సుల్ మొహ్సిన్ మొఘద్దమి, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హషెమి మంత్రులను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో సహకార ఉద్యమం బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలు, సహకార రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిని మంత్రి తుమ్మల ఆ□బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సహకార విధానాలు, సంస్థాగత సంస్కరణలు, సభ్యులకు అందిస్తున్న సేవలపై ఇరాన్ ప్రతినిధి బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో సహకార రంగంలో పరస్పర అనుభవాల మార్పిడి, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి. అనంతరం మంత్రులు తుమ్మల, వివేక్‌లు ఇరాన్ ప్రతినిధి బృంద సభ్యులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రతినిధి బృందం కూడా మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

# ప్రభుత్వోద్యోగులకు మహా భరోసా

**హైదరాబాద్,**

ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ సర్కారే

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. పేదలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి ఏపీలో ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో ఉద్యోగులు, పెన్షనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతమైన, సుస్థిరమైన, పారదర్శకమైన న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. గతంలో అమలులో ఉన్న హెల్త్ స్కీమ్‌లో ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యం కావడం లేదని, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం, ఉద్యోగుల ప్రాతినిధ్యం లేకపోవడం, ప్యాకేజీల సవరణలో పరిమితులు వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాటన్నింటికీ శాశ్వత పరిష్కారంగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ స్కీమ్ అమలులో ఉద్యోగులు, పెన్షనర్ల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కంట్రిబ్యూట్ చేస్తుందని, ప్రతి పైసాను ఈహెచ్‌ఎస్ అమలు కోసమే వినియోగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కామినేని, కాంటినెంటల్, కేర్, స్టార్, బసవతారకం వంటి ప్రముఖ కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు అత్యాధునిక వైద్య సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. ఈ పథకంలో భాగస్వామ్యమైన అన్ని హాస్పిటళ్ల యాజమాన్యాలు, డాక్టర్లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. ట్రస్టులో ప్రభుత్వం తరపున 17 మంది, ఉద్యోగుల తరపున 10 మంది, పెన్షనర్ల తరపున ముగ్గురు సభ్యులు ఉండటం వల్ల ఉద్యోగుల భాగస్వామ్యంతో పారదర్శకంగా పథకం అమలవుతుందని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ డిజిటల్ హెల్త్ కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రీఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు మొత్తం ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో వెల్‌నెస్ సెంటర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 1,800 మందికి ఔట్ పేషెంట్ సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఎంబీబీఎస్, స్పెషలిస్ట్ డాక్టర్లు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ల్యాబ్ పరీక్షలు, బ్రాండెడ్ మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వెల్‌నెస్ సెంటర్లు లేని 24 జిల్లాల్లో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ సేవలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సభ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల నాయకులు, నెట్‌వర్క్ హాస్పిటల్స్ ప్రతినిధులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



**ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం : డిప్యూటీ సీఎంకు ఉద్యోగుల కృతజ్ఞతలు**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య కార్డుల అమలుకు శ్రీకారం చుట్టడం పట్ల ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన, నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రత్యేక చొరవ తీసుకుని ఆరోగ్య కార్డుల అమలును వేగవంతం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ చైర్మన్ లచ్చిరెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఈహెచ్‌సీటీ ట్రస్ట్ మెంబర్ దేవరకొండ సైదులు, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.పోచయ్య, ఎస్టీయ□ రాష్ట్ర అధ్యక్షుడు, ఈహెచ్‌సీటీ ట్రస్ట్ మెంబర్ సదానందం గౌడ్, పెన్షనర్ల అసోసియేషన్ చైర్‌పర్సన్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు, పెన్షనర్ల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్య, వైద్యంపై ఖర్చు
# రాష్ట్ర ప్రగతికి పెట్టుబడి

**హైదరాబాద్, జూలై 17:**

వైద్యం, విద్యారంగాలపై ప్రభుత్వం పెట్టే ఖర్చు ఉచిత సంక్షేమం మాత్రమే కాదని, అది మన రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచేందుకు మానవ వనరులపై పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు సేవాలాల్ భవన్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి నియామక పత్రాలను ఆయన శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్మికుల హక్కులు, కనీస వేతనాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతంలో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో ఉన్నప్పుడు ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ కనీస వేతనాల సవరణ గురించి నిలదీశానని, కానీ నాటి ప్రభుత్వం ఏనాడూ సరైన సమాధానం ఇవ్వలేదని గుర్తుచేశారు. అయితే, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రత్యేక దృష్టి సారించి దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను సాధించి జీవోలను విడుదల చేశారని ప్రశంసించారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో మందుల కొరత ఉండకుండా పేదలకు సక్రమంగా మందులు పంపిణీ జరగడానికి మంత్రి వివేక్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని గ్రీన్ ఛానల్‌లో రూ.30 కోట్లు విడుదల చేయడానికి వెసలుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈఎస్ఐ హాస్పిటల్స్‌లో అధునాతన డయాలసిస్ యూనిట్లు, సీటీ స్కాన్ సౌకర్యాలు, బర్న్స్ వార్డులు, కార్డియాక్ కేర్ సెంటర్లను వేగంగా ఏర్పాటు చేసి ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఆధునీకీకరిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అదనంగా 120మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఆరుగురు డెంటల్ సివిల్ సర్జన్లు, 99 మంది ఫార్మసిస్టులు, 34 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 54 మంది ఏఎన్‌ఎంలు, ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయబోతున్నట్లు తెలిపారు. సనత్ నగర్ ఈఎస్ఐతోపాటు ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్‌లలో మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణాలను వేగవంతం చేయడానికి ప్రతి నెలా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. నిమ్స్ విస్తరణ పనులకు సైతం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 44,029 పడకల సామర్థ్యంతో దేశంలోనే అత్యధిక సగటు పడకలు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ద్వారా దాదాపు 75 లక్షల మందికి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఉన్న 16 మెడికల్ కాలేజీలకు అదనంగా నూతనంగా 9 మెడికల్ కాలేజీలను, 16 నర్సింగ్ కాలేజీలను, 28 పారామెడికల్ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, హైదరాబాదులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అత్యాధునిక కంప్యూటరైజ్డ్ మిషనరీతో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్ కామ్ ద్వారా శిక్షణ పొందే విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ప్రతి నెల రూ.2,000 స్టైఫండ్ అందిస్తూ ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. నూతనంగా నియామక పత్రాలు అందుకున్న నర్సింగ్ అధికారులను అభినందిస్తూ నర్సింగ్ అనేది ఉద్యోగం మాత్రమే కాదని, అది ఆపదలో ఉన్న దీన జనులకు ప్రేమతో సేవలు అందించే ఒక పవిత్రమైన సేవ అని అన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత

- బంజారాహిల్స్‌లోని ఆసుపత్రిలో చికిత్స

**హైదరాబాద్, జూలై 17**

తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. గత రెండు రోజులుగా మంత్రి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. మంత్రి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సహచరులు, కాంగ్రెస్ నాయకులు ఆరా తీశారు. మంత్రి త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని పార్టీ శ్రేణులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# మనసు ఫౌండేషన్ కృషి అభినందనీయం

- మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రశంసలు

**హైదరాబాద్, జూలై 17 :**



రాష్ట్ర మీడియా అకాడమీ చేపడుతున్న డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మనసు ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం చర్చలు జరిపారు. మీడియా అకాడమీ పాత తెలుగు, ఆంగ్ల, ఉర్దూ వార్తాపత్రికలను డిజిటలైజ్ చేసి జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర ఆసక్తిగల వారికి లక్షలాది పేజీల సమాచారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు సంబంధించిన సుమారు ఎనిమిది లక్షల పేజీలు డిజిటల్ ఆర్కైవ్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ విలువైన సమాచారాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత అభివృద్ధి చేయడం, సమాచార శోధనను సులభతరం చేయడం వంటి అంశాలపై మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిగాయి. సమావేశంలో ఫౌండేషన్ చైర్మన్ రాయుడు, సభ్యులు చంద్రమౌళి, దాము బాలాజీ, వి.శేషతలపతి సాయి, ఎ.వి.రమణమూర్తి, జగన్ పాల్గొన్నారు. మీడియా అకాడమీ తరపున కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచందర్ రావు, అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనసు ఫౌండేషన్ దాదాపు 28 లక్షల పేజీల చారిత్రక వార్తాపత్రికలు, పుస్తకాలు, గెజెట్లు, మ్యాగజైన్లు, ఇతర విలువైన పత్రాలను డిజిటలైజ్ చేసి భద్రపరిచిన విశిష్ట సేవలను అకాడమీ అభినందించింది. భవిష్యత్ తరాలకు చారిత్రక సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.సమావేశంలో డిజిటలైజేషన్ ప్రక్రియలో కాపీ రైట్ నిబంధనలను పాటించడం, సంబంధిత అధికారుల అనుమతులు పొందడం, అరుదైన పుస్తకాలు, వార్తాపత్రికలు, గెజెట్లు, మోనోగ్రాఫ్‌లు, ఇతర చారిత్రక పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత విస్తరించే దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, డిజిటలైజ్ చేసిన పత్రాలకు సమగ్ర ఇండెక్సింగ్, డాక్యుమెంటేషన్ నిర్వహించడం, ప్రత్యేక డిజిటల్ ఆర్కైవ్స్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడం, డేటా భద్రత కోసం ప్రత్యామ్నాయ కాపీలను భద్రపరచడం, జాతీయ స్థాయి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఉత్తమ విధానాలను అనుసరించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. డిజిటల్ ఆర్కైవ్స్, ఆర్కైవ్ నిర్వహణ, మీడియా పరిశోధన, జర్నలిజం చరిత్ర, డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు నిర్వహించాలని మనసు ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. చారిత్రక మీడియా సంపదను సంరక్షించడం, పరిశోధనకు ప్రోత్సాహం అందించడం, డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు మీడియా అకాడమీ, మనసు ఫౌండేషన్ పరస్పర సహకారంతో పనిచేయాలని నిర్ణయించారు.



# ఇంటర్ అర్హతతో నేడు మెగా జాబ్ డ్రైవ్

- హెచ్‌సీఎల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక

**కాజిపేట, జూలై 17:**

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రాం కోసం ఈనెల 18న మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ ఎంపికకు 2025 2026 విద్యా సంవత్సరంలో జనరల్, ఒకేషనల్ ఏ గ్రూపులో ఇంటర్ పూర్తి చేసినా అర్హులేనని, ఇంటర్ పరీక్షల్లో 75% మార్కులుండాలని తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంలో ఎంపికైన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతోపాటు డిగ్రీ కూడా పూర్తి చేసుకోవచ్చన్నారు. జీతం సంవత్సరానికి రూ.2.2 నుండి రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆండ్రాయిడ్ మొబైల్ వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఇన్‌చార్జి నరేష్ (7569177071/7981834205)ను సంప్రదించాలన్నారు.

# ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం
- ఆనాటి హామీని నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 16 :**



ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ(ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు2026 రూపకల్పనపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్ఠంగా రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయ□)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం తెలంగాణనే కాక దేశం మొత్తాన్ని కదిలించిందన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారని గుర్తు చేశారు. నాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నాటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా తాను (భట్టి విక్రమార్క), మంత్రి శ్రీధర్‌బాబు, క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ పెద్ద ఎత్తున పోరాడామన్నారు. భవిష్యత్తులో ప్రజా ప్రభుత్వం వచ్చాక విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకొస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం ఈ రోజు నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తున్నదని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతకాలని, వివక్ష కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని భట్టి చెప్పారు.

**బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలి**

బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.ఇందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త చట్టానికి సంబంధించిన సమగ్ర విధివిధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా నివేదికను సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత శాఖ సెక్రటరీని ఆదేశించారు. కర్ణాటకలో ఇప్పటికే ఇలాంటి చట్టం కోసం జరుగుతున్న ముసాయిదా ప్రయత్నాలను పరిశీలించి అక్కడి ఉత్తమ పద్ధతులను స్వీకరించాలని సూచించారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తామని, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ప్రకటించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి బిల్లులో తుది మార్పులు ఉంటాయని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం పొందిన అనంతరం ఈ చరిత్రాత్మక బిల్లును త్వరలోనే శాసనసభ ముందుకు తీసుకొస్తామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

**న్యాయపరంగా పటిష్ఠంగా ఉండాలి**

ఈ చట్టానికి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, సుప్రీంకోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్‌ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా పిలిపించి చర్చించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొలంబియా లా స్కూల్(న్యూయార్క్) నుండి ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఆమె అనుభవం చట్టాన్ని అత్యంత సమగ్రంగా, లోపరహితంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశానికి కమిటి సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు హాజరయ్యారు.

## భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

**వికారాబాద్, జూలై 17**

భర్త వేధింపులను తాళలేక ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషాద ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కుమార్తె మృతి చెందగా, కుమారుడు బావిలోని చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

**వేధింపులతో తీసుకున్న దారుణ నిర్ణయం**

పోలీసుల వివరాల ప్రకారం, యలాల్ మండలానికి చెందిన సుధాకర్ కుటుంబం ఉపాధి కోసం పదేళ్ల క్రితం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చింది. తోటలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంలో సుధాకర్ మద్యం సేవించి తరచూ భార్య వసంతతో గొడవపడుతూ వేధించేవాడని సమాచారం. గురువారం రాత్రి కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చి గొడవపడడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ముగ్గురూ బావిలోకి దూకారు.

**చెట్టు కొమ్మతో నిలిచిన ప్రాణం**

బావిలో పడుతున్న సమయంలో బాలుడు వేణు చేతికి లోపలికి వంగి ఉన్న చెట్టు కొమ్మ తగలడంతో దానిని గట్టిగా పట్టుకున్నాడు. సుమారు అరగంట పాటు ప్రాణభయంతో అదే కొమ్మను పట్టుకుని సహాయం కోసం ఎదురుచూశాడు. ఇదే సమయంలో ఇంట్లో భార్య, పిల్లలు కనిపించక వెతుకుతున్న సుధాకర్ బావి వద్దకు చేరుకోగా, లోపలి నుంచి కుమారుడి అరుపులు వినిపించాయి. వెంటనే బావిలోకి దిగి వేణును సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు.

**తల్లి, కుమార్తె మృతి**

అయితే అప్పటికే వసంత, ఆమె కుమార్తె నవ్య నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**దర్యాప్తు కొనసాగింపు**

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కుటుంబ పరిస్థితులు, వేధింపుల ఆరోపణలు సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వాంగ్మూలాలను నమోదు చేసి ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నారు.



# పార్లమెంట్‌లో పోరుకు రంగం సిద్ధం!

వర్షాకాల సమావేశాల్లో అధికార-ప్రతిపక్షాల శక్తిపరీక్ష

## డీలిమిటేషన్ బిల్లుపై వేడెక్కనున్న ఉభయ సభలు

### నీట్, రామమందిరం, ధరల పెరుగుదలపై కేంద్రాన్ని నిలదీయనున్న కాంగ్రెస్

### కీలక బిల్లులతో ముందుకు సాగాలని ఎన్‌డీఏ వ్యూహం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఏ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మెంత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.

# భారత రైల్వేలో నూతన శకం

- పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు
- జింద్-సోనిపట్ మార్గంలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- కాలుష్య రహిత రవాణాకు కీలక అడుగు.. పర్యావరణహిత సాంకేతికతతో కొత్త అధ్యాయం
- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా స్వచ్ఛ ఇంధన వినియోగానికి శ్రీకారం



**న్యూఢిల్లీ, జులై 17 :** భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైందనే చెప్పాలి. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు శుక్రవారం పట్టాలెక్కింది. హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు. హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకే తికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే.. రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవల్ని విస్తరించే అవకాశాలున్నాయి. ఇది రైల్వే రంగంలో కాలుష్య నియంత్రణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్వచ్ఛ ఇంధన వినియోగానికి కొత్త దిశను చూపనుంది. జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాలు హైడ్రోజన్ ఆధారిత రైలు సాంకేతికతను ఇప్పటికే అభివృద్ధి చేస్తున్నాయి. కాగా.. ప్రపంచంలోనే తొలి హైడ్రోజన్ ప్యాసింజర్ రైలును జర్మనీ ప్రవేశపెట్టింది. 2002లో అల్‌స్టోమ్ కొరాడియా ఐలింట్ రైలు ఎలాంటి ఇంధనం లేకుండా 1,175 కి. మీ. ప్రయాణించి రికార్డు సృష్టించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో 2024లో తొలి హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. అయితే.. 2027 నాటికి జపాన్.. తొలి హైడ్రోజన్ హైబ్రిడ్ రైలును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దేశంలో ప్రారంభం అయిన ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రొటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసు కురావడమో చేస్తున్నాయి. 1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది. ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్ర యాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

# భారీ ఉగ్రకుట్ర భగ్నం



### గుజరాత్‌లో ఐదుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదుల అరెస్టు


### ఉగ్ర నెట్‌వర్క్ ఏర్పాటు యత్నం.. బాంబు తయారీ కుట్ర వెలుగులోకి

### ఉపా చట్టం కింద కేసు నమోదు.. జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీ

**అహ్మదాబాద్, జూలై 17:** గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్రను రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం (ఏటీఎస్) భగ్నం చేసింది. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన ఐదుగురు అనుమానితులను అరెస్టు చేసింది. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకాలోని ఖడియాల్ గ్రామంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అరెస్టయిన వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు. వారిని మెహసానా జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం. భాటియా ఎదుట హాజరుపరచగా, జులై 24 వరకు ఏటీఎస్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు కుట్ర పన్నుతున్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు ఏటీఎస్ వెల్లడించింది. ఈ నెల 3న అరెస్టు చేసిన మరో ఎనిమిది మంది అనుమానితులను విచారించగా, తాజాగా పట్టుబడిన ఐదుగురి పాత్ర వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది. దర్యాప్తులో ఒక నిందితుడు క్రూడ్ టైమ్ బాంబు తయారు చేసి దానిని పరీక్షించేందుకు ప్రయత్నించినట్లు, మరో నిందితుడు బాంబు తయారీకి అవసరమైన సామగ్రిని అందించినట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో క్రియాశీల ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ఉగ్ర కార్యకలాపాలను విస్తరించడమే వారి లక్ష్యంగా ఉన్నట్లు ఏటీఎస్ పేర్కొంది. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని పలు సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటా"

- ఆరోగ్యం క్షీణిస్తున్న వేళ సోనమ్ వాంగ్‌చుక్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20వ రోజుకు చేరిన నిరాహార దీక్ష.. పార్లమెంట్ పాదయాత్రకు ప్రజలకు పిలుపు
- ఆరోగ్యంపై వైద్యుల ఆందోళన.. వాంగ్‌చుక్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నేత పవన్ ఖేరా




**న్యూఢిల్లీ, జూలై 17:** నిరవధిక నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకున్న ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. తాను శారీరకంగా బలహీనపడుతున్నప్పటికీ, సంకల్పం మాత్రం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్న వాంగ్‌చుక్, "జులై 20 వరకు ఎలాగైనా బతికి ఉంటాను. ఒకవేళ చనిపోతే దెయ్యంగానైనా తిరిగి వస్తాను" అని అన్నారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్, జులై 20న పార్లమెంట్ వరకు చేపట్టనున్న శాంతియుత పాదయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ విన్నపాన్ని పార్లమెంట్ ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా నిరాహార దీక్ష చేస్తున్న నేహా, మనీశ్, అమీన్ ఆరోగ్య పరిస్థితి కూడా విషమించిందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) వెల్లడించింది. డీహైడ్రేషన్ కారణంగా అమీన్ తీవ్ర ప్రమాదంలో ఉన్నారని, నేహా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకర స్థాయికి పడిపోయిందని, మనీశ్ తన శరీర బరువులో 10 శాతానికి పైగా కోల్పోయాడని తెలిపింది. అయినప్పటికీ తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామని విద్యార్థి నాయకులు ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా శుక్రవారం వాంగ్‌చుక్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న వాంగ్‌చుక్ డిమాండ్‌కు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. వాంగ్‌చుక్ ఆరోగ్య వివరాలను విడుదల చేసిన వైద్యుడు సతీశ్ లాంబా ప్రకారం, గత 24 గంటల్లో ఆయన 350 గ్రాముల బరువు కోల్పోయారు. ప్రస్తుతం ఆయన బరువు 56.55 కిలోలకు చేరగా, రక్తపోటు 108/68, రక్తంలో చక్కెర స్థాయి 70 మిల్లీగ్రాములు/డెసిలీటర్, పల్స్ రేటు నిమిషానికి 72గా నమోదైంది. స్వల్ప డీహైడ్రేషన్ ఉన్నప్పటికీ వైద్య బృందం 24 గంటలూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపారు. దీర్ఘకాలిక నిరాహార దీక్ష కారణంగా శరీరంలోని కొవ్వు, కండరాలు క్షీణించే దశకు చేరిందని, అవయవాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు.

# శేరిలింగంపల్లిలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

- శేరిలింగంపల్లి ఇంచార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్
- రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీకి సిద్ధమని ప్రకటన




**మియాపూర్, రాజముద్ర న్యూస్** :రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఇంచార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం మియాపూర్‌లోని శుభం బ్యాంకెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి అన్ని విధాలుగా సేవలు అందించినప్పటికీ తనకు తగిన గుర్తింపు, గౌరవం లభించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి చేదోడు వాదోడుగా ఉంటూ అనేక మందికి సాయం చేసినా సేవలను గుర్తిం చలేదన్నారు. అందుకే ఆ పార్టీ, నాయకులపై నమ్మకం లేక పార్టీ మారినట్లు తెలిపారు. గత పదేళ్లలో స్థానిక నాయకులకు ఒక్క నామినేటెడ్ పోస్ట్ కూడా ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇకపై తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని, అన్ని డివిజన్ కమిటీలు ఏర్పాటు చేసి రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. "ఇప్పుడే ఆరంభం. ఇక ముందు అసలు కార్యాచరణ ఉంటుంది" అని అన్నారు.





## భూ సర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేల సర్టిఫికెట్ రద్దు

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తామని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రీసర్వేపై శిక్షణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 150 మందికి సర్వే నిర్వాహణపై శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని ఇందులో కొంతమంది భూ రీసర్వేకు ఆమోదం తెలపకుండ ఉన్నారని అట్టి వారి సర్టిఫికెట్ల రద్దుకు ప్రభుత్వానికి సిఫారస్ చేస్తామన్నారు. సంవత్సరాల క్రితం చేపట్టిన భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భూ రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. దీర్ఘకాలిక దృక్పథంతో చేపట్టే భూ రీసర్వేకు సర్వేలో పాల్గొనడం ఉత్తమ అవకాశంగా భావించాలని దీనివల్ల అపారమైన అనుభవాన్ని తమ జీవితాల్లో పొందుతారని కలెక్టర్ తెలిపారు. భూ రీసర్వే మూలంగా భూమి రికార్డులు పూర్తి శుద్ధి చేయబడతాయని దీనికి సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకొని భూ రీ సర్వేలో పాల్గొనాలని శిక్షణ సర్వేయర్లకు సూచించారు. శిక్షణ సర్వేయర్లకు స్వంత మండలం కాకుండా అందుబాటులోని మండలాలకు నియమించాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సర్వేయర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా అదేవిధంగా పారితోషకాన్ని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడి సర్వేకు జిల్లా కలెక్టర్ సూచించారు. ముందుగా శిక్షణ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కె.వెంకటాచారి భూ రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. శిక్షణ పొందిన సర్వేయర్లకు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## పంట మార్పిడి సాగుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి




వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** రైతులు పంట మార్పిడి సాగును చేసుకునేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నాబార్డ్ ఫౌండేషన్, భాగస్వామి పక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ... రైతులు చిరుధాన్యాలు, పప్పు దినుసుల పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. ఎల్‌ఈనో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతుల అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పండ్ల, కూరగాయల, ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికతను ఉపయోగించి పంటల ఉత్పత్తిని పెంచుకునే విధంగా రైతులకు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.నాబార్డ్ ద్వారా వ్యవసాయ రంగానికి వివిధ పథకాలకు సహకారం అందిస్తుందో రైతులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలు మహిళా శక్తి రైతు సేవ కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను విక్రయించినట్లయితే రైతులకు నమ్మకంతో పాటు సంఘాలకు ఆదాయం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగు వల్ల 30 సంవత్సరాల వరకు ఆదాయం ఉంటుందని అదేవిధంగా అంతర్ పంటలు సాగు చేసుకోవడానికి అవకాశము ఉంటుందనే విషయాన్ని రైతులకు సూచించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ( ట్రైనీ ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, డూడిహెచ్ఎస్ఓ సత్తార్, డిఆర్డిఓ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నాబార్డ్ డీడీఎం అఖిల్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## ధన్నారం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన

- తెగుళ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి జి ప్రసన్నలక్ష్మి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్** : వికారాబాద్ మండల పరిధిలోని ధన్నారం గ్రామంలో శుక్రవారం వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి జి. ప్రసన్న లక్ష్మి , వ్యవసాయ విస్తరణ అధికారులు జి. అయ్యప్ప, రాఘవేందర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలను పరిశీలించారు. ప్రస్తుతం నెలకొన్న తక్కువ వర్షపాతం కారణంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై అవగాహన కల్పించారు. పంటల్లో నేల తేమను సంరక్షించేందుకు అంతర దుక్కులు చేయడం, కలుపు మొక్కలను తొలగించడం, అవసరమైన చోట మల్చింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో అధిక మోతాదులో ఎరువుల వినియోగాన్ని నివారించి, పంట ఎదుగుదలను కొనసాగించేందుకు అవసరమైన పోషక నిర్వహణ చేపట్టాలని తెలిపారు. పత్తి పంటలో వాడిపోవడం తగ్గించేందుకు 2శాతం యూరియా ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని, మొక్కజొన్న, ఇతర పంటల్లో నేల తేమను బట్టి అవసరమైన యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు. కంది వంటి పప్పుధాన్య పంటల్లో కూడా తేమ సంరక్షణ చర్యలు చేపట్టి, చీడపీడలు, తెగుళ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మండలంలోని అన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్లలోని పొలాలను నిరంతరం సందర్శించి, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సూచనలు అందించాలని మండల వ్యవసాయ అధికారి ఆదేశించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించి పంటలను సంరక్షించుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

మాజీ కార్పొరేషన్ చైర్మన్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి నాగేందర్ గౌడ్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని, యువత, నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరిట భారీ మోసం చేసిందని మాజీ కార్పొరేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.నాగేందర్ గౌడ్ నవాబ్ పేట్ మండల కేంద్రంలో యువ సంగ్రామ సదసు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎప్పటికప్పుడు ఆ మోసాన్ని ఎండగడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుచనునట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి నిరుద్యోగ యువత యువకుల్లారా మన హక్కుల సాధనకై భారీగా తరలివచ్చి ఈ అసమర్థ కాంగ్రెస్ మెడలు వంచలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంతమొల్ల దయాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, వేమారెడ్డి, మల్లేశం, శ్రీకాంత్ గౌడ్, ముకుంద రెడ్డి, వెంకట్ రెడ్డి,సందీప్, గోవర్ధన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం పంటల వైవిధ్యీకరణపై అవగాహన

ఏవో భానుశ్రీ




**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలో కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, పంటల వైవిధ్యీకరణ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం, పంటలపై దాని ప్రభావం, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై వివరించడం జరిగింది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం కంది, పెసర, మినుము, ఆముదం, పొద్దు తిరుగుడు , సజ్జలు, రాగులు, వేసుకోవాలి అని సూచించడం జరిగింది. తక్కువ నీటి వసతి ఉన్న పంటలను పండించి దిగుబడులు సాధించాలని సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ బండి ప్రవీణ్, ఉపసర్పంచ్ శ్రీ హెచ్. నవీన్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎ. పశుపతి, ఆత్మ డైరెక్టర్ రవి, గ్రామ రైతులు రవీందర్ గౌడ్, ప్రసాద్, యాదగిరి, సుధాకర్, నారాయణ, రంజిత్, గంగారం , ఏఈఓ రాకేష్ , పంచాయతీ కార్యదర్శి రాజు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో ఉన్న జిల్లాలోని అన్ని రేషన్ కార్డుదారులు ఈనెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల్లో లబ్ధిదారుల వివరాల పారదర్శకతను నిర్ధారించడం, నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించడం, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ రాయితీ ప్రయోజనాలు నిరంతరాయంగా అందేలా చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లాలో ఇంకా చాలా మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయలేదని అన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జిల్లాలో వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు సంబంధిత రేషన్ దుకాణం, సమీపంలోని ఏదైనా రేషన్ షాపుకు వెళ్లి ఈ-పోస్ యంత్రం ద్వారా వేలిముద్రలు నమోదు చేసి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోపు ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు భవిష్యత్తులో రేషన్ పంపిణీలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రతి రేషన్ కార్డుదారుడు వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరాయంగా పొందాలని కోరారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే అందజేయాలి



**రాజముద్ర న్యూస్, ఇచ్చోడ:** పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత అధికారులకు సకాలంలో అందజేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ షేక్ ముస్తఫా అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల గేట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్యూమరేషన్ కౌంటర్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్లు తాము తీసుకున్న సర్వే ఫారాలను పూర్తిగా నింపి ఆలస్యం చేయకుండా కౌంటర్ల వద్ద సమర్పించాలని కోరారు. ప్రతి అర్హుడి వివరాలు నమోదు కావడం ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, సర్వే ప్రక్రియలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా కౌంటర్లలోని అధికారులను సంప్రదించి సరైన వివరాలతో ఫారాలను సమర్పించాలని సూచించారు. సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో మందమర్రి మండల తహశీల్దార్ సతీష్ కుమార్, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డితో కలిసి, అలాగే మందమర్రి మున్సిపాలిటీ 19వ వార్డులో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. బీఎల్ఓలు సేకరించిన ఫారాల్లోని వివరాలను ఎప్పటికప్పుడు బీఎల్ఓ యాప్లో స్పష్టంగా నమోదు చేయాలని, బూత్ స్థాయి ఏజెంట్లు ఫారాల సేకరణలో పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హులైన ఓటర్లు స్వయంగా ఆన్లైన్లో తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. భోజనానికి ముందు తప్పని సరిగా చేతులు శుభ్రంగా కడుక్కునే అలవాటు పెంపొందించాలని పేర్కొన్నారు. కేజీబీవీలను ఇంటర్మీడియట్ స్థాయికి ఆధునికీకరించామని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భూ రీ-సర్వే సమగ్రంగా, పారదర్శకంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్
- రైతుల సమక్షంలోనే సరిహద్దుల నిర్ధారణ చేయాలి
- ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలి
- తిరుమలాయపాలెం కాకరవాయిలో రీ-సర్వే పనుల పరిశీలన



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమాన్ని సమగ్రంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గంలో శనివారం విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును చూస్తూ రైతులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు లేవనెత్తిన ప్రశ్నలకు ఓర్పుతో సమాధానమిచ్చి సందేహాలు నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పట్టాదారు భూమిని సంబంధిత భూ యజమానులు, రైతుల సమక్షంలోనే సర్వే చేసి సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. భూ రీ-సర్వేపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థులు అడిగే ప్రతి సందేహానికి వెంటనే సమాధానం ఇచ్చి వారికి విశ్వాసం కల్పించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, అధునాతన సాంకేతిక ప్రమాణాలతో నాణ్యమైన సర్వే నిర్వహించాలని, భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని, ప్రతి రైతు తన భూమికి ఖచ్చితమైన రికార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలంలో సీతారామ ప్రాజెక్టు లో భాగంగా నిర్మిస్తున్న టన్నెల్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు.ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఇరిగేషన్ డిఈ రమేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం: రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయాలి



- వరికి బదులు స్వల్పకాలిక, తక్కువ నీటి పంటలు సాగు చేయండి
- పోచారం పొలాల్లో రైతులతో మాట్లాడిన కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి తక్కువ రోజుల్లో దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం పోచారం గ్రామంలోని పొలాలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకు వారితో మాట్లాడి, వర్షాభావ పరిస్థితులను వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో తక్కువ వర్షపాతమే నమోదైందని, దీంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని చెప్పారు."రైతులు తమ బోరు బావుల్లో ఉన్న నీటి సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలి. అధిక నీరు అవసరమయ్యే వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, స్వల్పకాలిక, కరువును తట్టుకునే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి" అని అన్నారు.రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా★ ఉన్నాయని, వరి సాగు చేసి రైతులు నష్టపోకుండా ఉండేందుకే ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు.ప్రభుత్వం అండగా ఉంటుందికలెక్టర్ ఇంకా మాట్లాడుతూ: జిల్లాలో యూరియా కొరత లేదు. అవసరమైన నిల్వలు ఉన్నాయి. ఆరుతడి పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి.శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలి. నీటిని ప్రతి చుక్క పొదుపుగా వాడాలి. తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం ఇచ్చే కూరగాయలు, ఇతర పంటల సాగుపై దృష్టి పెట్టాలి.వ్యవసాయ శాఖ అధికారులు సూచించే సాగు విధానాలను తప్పనిసరిగా పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసిల్దార్ డి. సైదులు, మండల వ్యవసాయ అధికారిణి ఆర్. వాణి, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి
- భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం
- రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:**

జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్కలెక్టర్ మనోజ్, కమిషన్ సభ్యులు, జిల్లా అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, ఆశ్రమ పాఠశాలలు, ఆర్ఓఎఫ్ఆర్ చట్టం అమలు, మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లాలో సుమారు 56,969 మంది షెడ్యూల్డ్ తెగలు, 1,99,493 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు ఉన్నారని తెలిపారు. వారికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, దుప్పట్లు, బంకర్ బెడ్లు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జాబ్కార్డు కలిగిన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఉపాధి కల్పించాలని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.20లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు.

### భూ సమస్యలు, అట్రాసిటీ కేసులపై సమన్వయంతో చర్యలు..

ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు, గిరిజనేతరులకు నిబంధనల మేరకు భూ పట్టాలు జారీ చేసేలా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసులను వేగంగా విచారించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెల్టు షాపులపై కఠిన చర్యలు చేపట్టాలని, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో రహదారులు, తాగునీటి వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వెయ్యికి పైగా అట్రాసిటీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో కూడా ప్రత్యేక కోర్టు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గ మల్లయ్య, పెద్ది రాజన్న, పౌరసరఫరాల కమిటీ సభ్యులు జిల్లపల్లి వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ఫిఫా ప్రపంచకప్ విజేతలకు తొలిసారి 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'






**న్యూయార్క్, జులై 17 ( ):** ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫిఫా ప్రపంచకప్--2026లో విజేతగా నిలిచే జట్టుకు ఈసారి సరికొత్త గౌరవం దక్కనుంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీ, బంగారు పతకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'ను కూడా అందజేయనున్నట్లు ఫిఫా ప్రకటించింది. అమెరికన్ క్రీడల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ సంప్రదాయాన్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తొలిసారిగా అమలు చేయనున్నారు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే ఈ ప్రత్యేక ఉంగరాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత విజేత జట్టు కెప్టెన్, ప్రధాన కోచ్‌కు ప్రత్యేక రింగ్స్ అందజేస్తారు. అనంతరం జట్టు సభ్యుల కోసం రూపొందించిన మొత్తం 30 ఒరిజినల్ రింగ్స్‌ను అధికారికంగా బహూకరిస్తారు. ప్రతి రింగ్‌పై ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపంతో పాటు విజేత జట్టుకు సంబంధించిన ప్రత్యేక డిజైన్ ఉంటుంది. ప్రతి ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్‌తో పాటు అసలైనదని ధ్రువీకరించే ప్రమాణపత్రం కూడా అందజేయనున్నారు. ఈ అరుదైన జ్ఞాపకాన్ని అభిమానులకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 2,026 ఛాంపియన్‌షిప్ రింగ్స్‌ను తయారు చేయాలని ఫిఫా నిర్ణయించింది. అందులో 30 రింగ్స్ విజేత జట్టుకు కేటాయించగా, మిగిలిన 1,996 రింగ్స్‌ను అధికారిక లైసెన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులకు విక్రయించనున్నారు. దీంతో ప్రపంచకప్ చరిత్రలో భాగమైన ప్రత్యేక జ్ఞాపకాన్ని అభిమానులు సొంతం చేసుకునే అవకాశం లభించనుంది. ఇదిలా ఉండగా, 2026 ఫిఫా ప్రపంచకప్ తుది సమరానికి రంగం సిద్ధమైంది. ఫైనల్లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం సాధించిన స్పెయిన్ ఫైనల్‌కు చేరుకోగా, అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ తుది పోరుపై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.




## ధోనీ కోసమే సీఎస్‌కేలో..

సంజూ శాంసన్

**చెన్నై, జూలై 17 ( ):** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తన జట్టు మార్పుపై వస్తున్న చర్చలకు చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సంజూ శాంసన్ తొలిసారిగా స్పందించారు. మహేంద్ర సింగ్ ధోనీతో కలిసి ఆడాలనే కోరికతోనే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరినట్లు ఆయన వెల్లడించారు. రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం తన కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయమని, అయితే కొన్ని పరిస్థితుల కారణంగా ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. దాదాపు పదేళ్లపాటు రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంజూ శాంసన్, ఆ జట్టుకు కెప్టెన్‌గా కూడా సేవలందించారు. అయితే ఐపీఎల్--2026 సీజన్‌కు ముందు ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఒకే ఫ్రాంచైజీకి సుదీర్ఘకాలం సేవలందించిన ఆటగాడు అకస్మాత్తుగా జట్టు మారడంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. తాజాగా జియోస్టార్ నిర్వహించిన 'సూపర్ స్టార్స్ షో'లో మాట్లాడిన సంజూ శాంసన్, తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వెల్లడించారు. మహేంద్ర సింగ్ ధోనీతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం, ఆయన నుంచి మరింత నేర్చుకోవాలనే ఆకాంక్ష కూడా చెన్నై జట్టులో చేరడానికి ఒక ప్రధాన కారణమని పేర్కొన్నారు. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్‌ను విడిచి రావడం తనకు భావోద్వేగపూరితమైన నిర్ణయమని చెప్పారు. టీనేజ్ ప్రతిభావంతుడు వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావడంతో పరిస్థితులు మారాయని సంజూ శాంసన్ పరోక్షంగా సూచించారు. జట్టు భవిష్యత్ ప్రణాళికలు, ఆటగాళ్ల సమీకరణల నేపథ్యంలో తాను కొత్త నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే రాజస్థాన్ రాయల్స్‌తో గడిపిన అనుబంధం, అభిమానుల ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేనని స్పష్టం చేశారు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొత్త ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించడమే తన లక్ష్యమని సంజూ పేర్కొన్నారు.

# డోపింగ్ కేసులో మొహమ్మద్ నవాజ్‌కు ఊరట




**దుబాయ్, జూలై 17 ( ):** పాకిస్థాన్ ఎడమచేతి స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఊరటనిచ్చింది. యాంటీ-డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి తొలుత విధించిన మూడు నెలల నిషేధాన్ని చికిత్సా కార్యక్రమం పూర్తి చేసిన నేపథ్యంలో ఒక నెలకు తగ్గించింది. దీంతో నవాజ్ మళ్లీ పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్ అనంతరం నిర్వహించిన డోపింగ్ పరీక్షలో నవాజ్ శరీరంలో కార్బాక్సీ-టీహెచ్‌సీ అనే నిషేధిత పదార్థం ఉన్నట్లు తేలింది. ఇది గంజాయిలో ఉండే టీహెచ్‌సీ సమ్మేళనం శరీరంలో మార్పు చెందిన రూపంగా గుర్తించబడుతుంది. నవాజ్ నిబంధనల ఉల్లంఘనను అంగీకరించినప్పటికీ, ఆ పదార్థాన్ని పోటీలకు వెలుపల మాత్రమే ఉపయోగించానని, తన క్రీడా ప్రదర్శనను మెరుగుపరచుకోవడానికి దానిని వినియోగించలేదని ఐసీసీ ఎదుట వివరించాడు. అతని వివరణతో సంతృప్తి చెందిన ఐసీసీ, మాదకద్రవ్యాల దుర్వినియోగ నిరోధక చికిత్సా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తే శిక్షను తగ్గిస్తామని ప్రకటించింది. మే 1 నుంచి అమల్లోకి వచ్చిన తాత్కాలిక సస్పెన్షన్‌ను పరిగణనలోకి తీసుకుని, నవాజ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఐసీసీ వెల్లడించింది. చికిత్సా కార్యక్రమాన్ని పూర్తిగా పూర్తి చేసినందున ఇకపై అదనపు అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే, యాంటీ-డోపింగ్ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు నవాజ్ ఆడిన అన్ని మ్యాచ్‌లలోని వ్యక్తిగత గణాంకాలను అధికారికంగా రద్దు చేశారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరఫున ఏడు మ్యాచ్‌లు ఆడిన నవాజ్ 15 పరుగులు చేసి ఏడు వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 54 పరుగులు చేసి ఆరు వికెట్లు సాధించాడు. తాజాగా లంక ప్రీమియర్ లీగ్‌లో గాలె గ్లాడియేటర్స్ తరఫున ఆడేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కూడా లభించడంతో నవాజ్ త్వరలోనే మళ్లీ పోటీ క్రికెట్‌లో కనిపించనున్నాడు.

# ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు కనువిందైన ముగింపు వేడుక

న్యూయార్క్, జూలై 17 ( ): ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్--2026 తుది సమరానికి రంగం సిద్ధమైంది. అమెరికాలోని మెట్లైఫ్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక ఫైనల్‌ను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఫిఫా తొలిసారిగా భారీ ముగింపు వేడుకతో పాటు ప్రత్యేక హాఫ్‌టైమ్ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్వహించే ముగింపు వేడుకల్లో ప్రపంచ ప్రఖ్యాత సంగీత కళాకారులు లారా పౌసిని, నికోల్ షెర్జింగర్, రాబీ విలియమ్స్ తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. ప్రముఖ సామాజిక మాధ్యమాల కంటెంట్ సృష్టికర్త ఐషోస్పీడ్ కూడా ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు. హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక అతిథిగా హాజరుకానుండగా, అమెరికా జాతీయ గీతాన్ని ప్రముఖ గాయని జెన్నిఫర్ హడ్సన్ ఆలపించనున్నారు. ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా అమెరికన్ సూపర్ బౌల్ తరహాలో హాఫ్‌టైమ్ ప్రదర్శన నిర్వహించనున్నారు. సుమారు 11 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సంగీతకారుడు క్రిస్ మార్టిన్ రూపొందించారు. ఇందులో మడోన్నా, షకీరా, జస్టిన్ బీబర్, బీటీఎస్ బృందం, బర్నా బాయ్, గుస్తావో దుదామెల్‌తో పాటు ప్రముఖ బాలల పాత్రలు కూడా సందడి చేయనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఫిఫా గ్లోబల్ సిటిజన్ ఎడ్యుకేషన్ ఫండ్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వెనుకబడిన చిన్నారులకు నాణ్యమైన విద్య, ఫుట్‌బాల్ శిక్షణ అందించేందుకు 100 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం జులై 18 రాత్రి 11 గంటలకు ముగింపు వేడుకలు ప్రారంభం కానుండగా, అర్జెంటీనా--స్పెయిన్ మధ్య ప్రపంచకప్ ఫైనల్ జులై 19 తెల్లవారుజామున 12:30 గంటలకు ఆరంభం కానుంది. భారతదేశంలో ఈ మెగా ఫైనల్‌తో పాటు ముగింపు వేడుకలను టెలివిజన్, డిజిటల్ వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.







## గంభీర్, కోహ్లీ మధ్య విభేదాల్లేవు

సితాంశు కోటక్

**కార్డిఫ్, జులై 17 ( ):** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య విభేదాలు నెలకొన్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ ఖండించారు. వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, జట్టు ప్రయోజనాల కోసం ప్రతిరోజూ అనేకసార్లు పరస్పరం చర్చించుకుంటూ ఉంటారని స్పష్టం చేశారు. ఇంగ్లండ్‌తో కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డే అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్, గంభీర్, కోహ్లీ మధ్య సంబంధాలు ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నాయని తెలిపారు. గురువారం ఒక్కరోజే వారిద్దరూ దాదాపు పది సార్లు మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. జట్టులోని వ్యూహాలు, మ్యాచ్ పరిస్థితులు, బ్యాటింగ్‌కు సంబంధించిన అంశాలపై తరచూ చర్చలు జరుపుతుంటారని వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారత జట్టు సాధన సందర్భంగా గంభీర్, కోహ్లీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విభేదాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని కోటక్ స్పష్టం చేశారు. కొద్దిసేపు మాట్లాడకపోవడాన్ని విభేదాలుగా చిత్రీకరించడం సరైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. విరాట్ కోహ్లీ భవిష్యత్‌పై కూడా కోటక్ స్పందించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే కోహ్లీ కోరిక ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన కోహ్లీకి నిరూపించుకోవాల్సింది ఏమీ లేకపోయినా, జట్టుకు ఉపయోగపడినంతకాలం భారత జట్టుకు సేవలందించాలనే తపనతో ఉన్నాడని చెప్పారు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో ఆదివారం జరిగే మూడో, చివరి వన్డేతో ఈ సిరీస్ ముగియనుంది. అనంతరం సెప్టెంబర్‌లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కూడా విరాట్ కోహ్లీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.



# అజిత్ కొత్త సినిమాలో హీరోయిన్ మార్పు?

**హైదరాబాద్, జూలై 17 ( ):** కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తదుపరి సినిమాపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. ఇటీవల 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో విజయాన్ని అందుకున్న అజిత్ ప్రస్తుతం కార్ రేసింగ్‌పై దృష్టి సారించినప్పటికీ, ఆయన కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన వార్తలు తరచూ వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తోనే అజిత్ మరో సినిమా చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కోయంబత్తూరుకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. మొదట ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే తేదీల సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఆమె స్థానంలో నటి కయాదు లోహర్‌ను తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలపై కూడా అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. అలాగే ఈ చిత్రంలో మరో కీలక పాత్రలో నటి స్వాసిక నటించనున్నట్లు సమాచారం. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూర్చనున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానికి ముందు దశలో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే చిత్రబృందం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# 'దిల్ సే' బైక్ సాంగ్ వెనుక ఆసక్తికర కథ చెప్పిన జేడీ చక్రవర్తి

**హైదరాబాద్, జూలై 17 ( ):** ప్రముఖ నటుడు జేడీ చక్రవర్తి గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'దిల్ సే' చిత్రంలోని బైక్ పాట చిత్రీకరణ వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను ప్రొఫెషనల్ బైకర్‌నని చెబుతూ, తన బైక్ నడిపే శైలిని చూసిన దర్శకుడు వంశీ ప్రత్యేకంగా ఆ పాటను రూపొందించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. వంశీతో కలిసి దర్శకుడు రామ్ గోపాల్ వర్మ వద్ద సహాయ దర్శకులుగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్న జేడీ, "నీ బైక్ రైడింగ్ స్టైల్ నాకు చాలా ఇష్టం. దానిపై ఒక పాట తీయాలి అనిపించింది" అని వంశీ చెప్పారని వెల్లడించారు. అయితే తాను ఆ పాటను 24 ఫ్రేమ్స్‌లో చిత్రీకరిస్తేనే చేస్తానని షరతు పెట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నటి శ్రీదేవిపై తనకున్న అభిమానాన్ని కూడా జేడీ సరదాగా ప్రస్తావించారు. అలాగే 'దిల్ సే' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన మహేశ్వరి తొలిసారి ద్విచక్రవాహనంపై కూర్చోవడం కూడా అదే పాట చిత్రీకరణ సమయంలో జరిగిందని గుర్తు చేసుకున్నారు. బైక్ ప్రయాణం గురించి అనుభవం లేకపోవడంతో ఆమెకు మొదట్లో భయం వేసిందని, అయినప్పటికీ చిత్రీకరణ విజయవంతంగా పూర్తైందని తెలిపారు. సినిమాల ప్రచారం గురించి కూడా జేడీ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. సినిమా బాగుంటే ప్రచారం సహజంగానే ఫలిస్తుందని, కంటెంట్‌పై నమ్మకం ఉండాలే తప్ప అతిగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. కాన్ఫిడెన్స్‌కు, ఓవర్ కాన్ఫిడెన్స్‌కు తేడా ఉందని వివరిస్తూ, ప్రేక్షకులను ఆకట్టుకునేది చివరకు సినిమా నాణ్యతేనని పేర్కొన్నారు. సినిమా ప్రమోషన్లపై తన అభిప్రాయాన్ని వివరించేందుకు జేడీ ఆసక్తికరమైన ఉదాహరణను కూడా చెప్పారు. మంచి సినిమా పోస్టర్ ఒక్కటే ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించగలదని, ఎక్కువ ప్రచారం కంటే బలమైన కంటెంట్‌కే ప్రేక్షకులు ప్రాధాన్యం ఇస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.




# ఆహార భద్రతపై కాజల్ ప్రచారం

హైదరాబాద్, జూలై 17 ( ): టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన తాజా చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రచారంలో భాగంగా ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురుగుమందుల అధిక వినియోగం, ఆహార కల్తీ, వాటి వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని ఈ చిత్రం ప్రధాన అంశంగా తీసుకురావడంతో, అదే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాజల్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. తన భోజనానికి సంబంధించిన చిత్రాన్ని పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ తాము తీసుకునే ఆహారం నాణ్యతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో పాల్గొనాలని హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలకు కూడా సవాల్ విసిరారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ తల్పడే కూడా ఈ ప్రచారానికి మద్దతు తెలిపారు. బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాల్సిన అవసరం ఉందని, మనం తినే ఆహారం వెనుక ఉన్న వాస్తవాలపై చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన 'ది ఇండియన్ స్టోరీ' చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పణలో సాగర్ బి. షిండే నిర్మించిన ఈ చిత్రం జులై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం కాజల్ ప్రారంభించిన ఈ అవగాహన ప్రచారానికి సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది.



# సమంతకు సీమంతం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com